# నవతరం

RNI NO. APTEL/2014/58326

తెలుగు దినపత్రిక

సంపుటి : -13 సంచిక : 115 ఎడిషన్ ఇన్‌ఛార్జ్ : నవచైతన్య శిరిగిరి

శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం రాజమండ్రి

04-03-2026 బుధవారం వెల : 1 /- పేజీలు : 4








# కంబిరిగాంలో భూదందా భయానకం!

**- ల్యాండ్ సీలింగ్ భూములపై వేల కోట్ల దోపిడీ**

**- రెవెన్యూ వ్యవస్థే భాగస్వామ్యమా?**

**నవతరం -శ్రీకాకుళం**

శ్రీకాకుళం జిల్లా పలాస మండలంలోని కంబిరిగాంలో భూములకు సంబంధించి జరుగుతున్న అవకతవకలు ఇప్పుడు జిల్లా వ్యాప్తంగా సంచలనం సృష్టిస్తున్నాయి. ప్రభుత్వానికి చెందిన ల్యాండ్ సీలింగ్ భూములను అక్రమంగా ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోకి అప్పగించినట్లు బలమైన ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

ఈ వ్యవహారంలో పలాస తహశీల్దార్ కార్యాలయం అవినీతికి కేరాఫ్ అడ్రస్‌గా మారిందన్న విమర్శలు తీవ్రమవుతున్నాయి.

## సీలింగ్ భూములపై 1-బి, అడంగల్ మాయాజాలం..

కంబిరిగాంలో ల్యాండ్ సీలింగ్ పరిధిలోకి వచ్చే భూములకు సంబంధించి 1-బి, అడంగల్ పత్రాలను అక్రమంగా జారీ చేసినట్లు సమాచారం. ఇనాము దారులుగా ముగ్గురు - నందేశ్ చౌదరి, పరశురాం చౌదరి, వెంకటరావు చౌదరిల పేర్లపై పట్టాలు మంజూరు చేసినట్లు తెలుస్తోంది. వాస్తవానికి ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాల్సిన భూములే ఇలా ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోకి వెళ్లిపోయినట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు.

## కోట్ల రూపాయల లావాదేవీలు -కార్లు కానుకలుగా?

ఈ భూదందాలో స్థానిక రెవెన్యూ అధికారులకు సుమారు రూ.3 కోట్ల నగదు లంచాలతో పాటు రెండు స్విఫ్ట్ డిజైర్ కార్లు రియల్టర్ల నుంచి కానుకలుగా అందినట్లు ప్రచారం జరుగుతోంది. అదే కారణంగా సుమారు రూ.1000 కోట్ల విలువైన ల్యాండ్ సీలింగ్ భూములు అక్రమంగా ధారాదత్తం చేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. "మేఘాల మీద" పత్రాలు జారీ చేస్తూ ప్రభుత్వ భూములను ప్రైవేట్ రియల్ ఎస్టేట్ వ్యాపారులకు అప్పగించారన్న అనుమానాలు బలపడుతున్నాయి.

## వెంచర్లుగా విభజన - అమాయకులే బలులు

ప్రభుత్వానికి చెందిన భూములు ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లోకి వెళ్లిన తరువాత వాటిని ప్లాట్లు, వెంచర్లుగా విభజించి అమ్మకాలు జరుపుతున్నట్లు తెలుస్తోంది. ల్యాండ్ సీలింగ్ భూములు కొనుగోలు చేస్తే భవిష్యత్తులో తీవ్ర నష్టం వాటిల్లే ప్రమాదం ఉన్నప్పటికీ, కల్లబొల్లి మాటలతో క్రయవిక్రయాలు సాగిస్తున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## హైకోర్టుకు చేరిన భూదందా...

ఈ అక్రమాలపై కంబిరిగాం చెందిన నరేష్ అనే వ్యక్తి ఇప్పటికే ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో కోట్ల పిల్ దాఖలు చేసినట్లు సమాచారం. తాజాగా మరో 16 మంది రైతులు కూడా భూక్రయ విక్రయాలు నిలిపివేయాలంటూ రిట్ పిటిషన్ దాఖలు చేసినట్లు తెలుస్తోంది.

కోర్టు పరిధిలోకి వ్యవహారం వెళ్లడంతో అధికారుల్లో గుబులు మొదలైంది. ప్రభుత్వ భూములు కాపాడాలని డిమాండ్ ల్యాండ్ సీలింగ్ భూములు కొనుగోలు చేస్తే కొనుగోలుదారులు తీవ్రంగా నష్టపోతారని స్థానికులు గగ్గోలు పెడుతున్నారు.

జిల్లా ఉన్నతాధికారులు వెంటనే స్పందించి ప్రభుత్వానికి చెందిన భూములను స్వాధీనం చేసుకుని, ప్రభుత్వ కార్యాలయాలు, పేదలకు ఇళ్ల స్థలాల కేటాయింపుకు ఉపయోగించాలని డిమాండ్ చేస్తున్నారు.

## ప్రశ్నలు ఇవే...

### సీలింగ్ భూములపై అక్రమ పట్టాలు ఎలా జారీ అయ్యాయి?

రెవెన్యూ అధికారుల పాత్ర ఎంతవరకు ఉంది? వేల కోట్ల ప్రభుత్వ ఆస్తికి రక్షణ ఎప్పుడు? కంబిరిగాంలో బయటపడుతున్న ఈ భూదందా వ్యవహారం జిల్లా పాలనపై మచ్చగా మారుతోంది. శ్రీకాకుళం జిల్లాలోని పలాస మండలం కంబిరిగాం భూములపై జరుగుతున్న ఈ దోపిడీపై ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకుంటుందా? లేక మరో వేల కోట్ల స్కామ్‌గా మిగిలిపోతుందా? అన్నది వేచిచూడాలి...

# దివ్యాంగుల సేవలో న్యాయ సేవాధికార సంస్థ

## చిన్నారులకు శ్రవణ యంత్రాల పంపిణీ

**నవతరం -శ్రీకాకుళం**

ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు చట్టపరమైన రక్షణతో పాటు మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యమని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె. హరిబాబు పేర్కొన్నారు. మంగళవారం ప్రపంచ శ్రవణ దినోత్సవం సందర్భంగా ఆయన స్థానిక బెహరా మనోవికాస్ కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా వినికిడి లోపం ఉన్న చిన్నారులకు ఆయన శ్రవణ యంత్రాలను అందజేశారు. అనంతరం వైద్య చికిత్సా విభాగాన్ని ప్రారంభించి, పిల్లలకు అందుతున్న వైద్య సేవలను స్వయంగా పరిశీలించారు.

చిన్నారుల ఆరోగ్యం, విద్యపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, వారికి ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని కేంద్ర నిర్వాహకులకు ఆయన సూచించారు. కేంద్రంలో ఎదురవుతున్న సమస్యలను అడిగి తెలుసుకున్న ఆయన, ఏవైనా ఇబ్బందులు ఉంటే వెంటనే న్యాయ సేవాధికార సంస్థ దృష్టికి తీసుకురావాలని తెలిపారు. వైద్య ఆరోగ్య శాఖ, మానసిక ఆరోగ్య సంస్థల సమన్వయంతో చిన్నారులకు అవసరమైన అన్ని రకాల వైద్య చికిత్సలు అందేలా చర్యలు తీసుకుంటామని వివరించారు. అలాగే, అర్హులైన వారందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.



జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి కె. అనిత సౌజన్యంతో చిన్నారులకు పండ్లు, బిస్కెట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్‌సీడీ ప్రాజెక్ట్ ఆఫీసర్ డాక్టర్ శివరంజని, ఆడియాలజిస్ట్ డాక్టర్ ఈ. అఖిల రాణి, సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

# అతిసార కట్టడికి పారిశుధ్య సమరం

**- క్షేత్రస్థాయిలో జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ మెరుపు తనిఖీలు**

**- అన్నా క్యాంటీన్, కాజీపేట వీధుల్లో పారిశుధ్య పర్యవేక్షణ**

**- ఒక్కరోజే 186 టన్నుల వ్యర్థాల తొలగింపు.. 17 జేసీబీలు, 24 ట్రాక్టర్లతో ప్రక్షాళన**

2లో






ఎడిటోరియల్

# విష కౌగిలి!

ఇజ్రాయిల్ పర్యటన ముగించుకున్న మన ప్రధాని దేశానికి చేరుకున్నారు. ఈ పర్యటనలో ఏం తెచ్చారు? వ్యూహాత్మక లాభాలా? దౌత్య వివాదాలా? అన్నది తెలియాలి. గాజా మంటల్లో వేలాది పౌరులు ప్రాణాలు కోల్పోతున్న వేళ ఆ దేశ సందర్శన ఎవరికి ఉపయోగం? ఇప్పుడు చర్చించాల్సిన అవసరం ఉంది. ప్రపంచ రాజకీయాల్లో దేశాల మధ్య వైరు ధ్యాలు వాటి ప్రయోజనాలకంటే తరచూ ముందుకు రావడం కొత్త విషయం కాదు. కానీ, అవి దేశ ఆర్థిక, దౌత్య, నైతికస్థితిని ప్రభావితం చేసే స్థాయికి చేరితే గనుక ప్రశ్నించడం పౌరుల హక్కు. భారత ప్రధాని ఇజ్రాయిల్ పర్యటన కచ్చితంగా మనకు అలాంటి బాధ్యతను గుర్తుచేస్తుంది. ప్రపంచ పరిణామాలు, సమీకరణలు శరవేగంగా మారుతున్న సమయంలో ఈ పర్యటన అనేక సందేహాలను లేవనెత్తింది. ఓ వైపు రష్యా-ఉక్రెయిన్ యుద్ధం, మరోవైపు వెనిజులా అధ్యక్షుడి కిడ్నాప్, ఇంకోవైపు ఇరాన్‌లో యుద్ధ వాతావరణం, అమెరికా టారిఫ్‌ల పెత్తనం- ప్రజలను కలవరపెడుతున్న సమయంలో ప్రధాని ఇజ్రాయిల్ పర్యటన ప్రపంచ దృష్టిని ఆకర్షించింది. అయితే మోడీ వ్యవ హరించిన తీరు, ప్రసంగం సామ్రాజ్యవాద దేశానికి లొంగుబాటులా కనిపించింది!

శాంతి, స్థిరత్వం గురించి ప్రసంగించిన ప్రధాని గాజాలో నలుగు తున్న పాలస్తీనా ప్రజల గురించి ఒక్క మాటైనా మాట్లాడలేదు. శిథిలాల మధ్య విలపిస్తున్న చిన్నారుల కేకలు ఆయన చెవులకు వినిపించలేదా? వేలాది పౌరుల మరణాలు, ఆకలి, నిరాశ్రయత్వం- ఇవన్నీ ప్రపంచదేశాలను కదిలిస్తున్నప్పుడు భారతదేశం మౌనభాషనే ఎం దుకు ఎంచుకుంది? ఒక పక్షానికి మద్దతుగా కనిపించే ఈ సన్నిహితత మన చారిత్రక విలువల్ని, సమానత్వ భావాన్ని, విదేశాంగ విధానాన్ని ఎక్కడికి తీసుకెళ్తోంది? దేశాల మధ్య మిత్రుత్వం కాదనలేం, కానీ మానవత్వం కన్నా మారణ హోమం పైచేయి సాధిస్తుంటే, ఆ మైత్రి దేశ గౌరవానికే ప్రశ్నగా మారదా? ఎనిమిది దశాబ్దాల పాలస్తీనా స్వతంత్ర పోరాటాన్ని, ప్రజల ఆకాంక్షను బాంబుల వర్షంతో, తుపాకీగొట్టాలతో అణచివేస్తున్న ప్రపంచ నేరస్తుడు నెతన్యాహు. అంతర్జాతీయ న్యాయస్థానమే అతన్ని దోషిగా ప్రకటించింది. అతని విషకౌగిలిలో భారత్‌ను బంధీగా మార్చడం ప్రమా దాన్ని కొనితెచ్చుకున్నట్టే కదా! ఒక జాతి హననం, మానవ హక్కులు ఉల్లంఘన యథేచ్ఛగా సాగుతున్నా ఎన్నడూ దానిగురించి మోడీ ప్రస్తా వించింది లేదు, ఆ చర్యల్ని ఖండిం చనూ లేదు. ఇప్పుడేమో హమాస్‌ను వ్యతిరేకిస్తున్నానని, శాంతి స్థాపనకు ఇజ్రాయిల్‌తో కలిసి పనిచేస్తానని చెప్పడం హాస్యాస్పదం.

అసలు నెతన్యాహును కలిసేందుకే చాలామంది దేశాధినేతలు వెనుకంజ వేస్తున్న పరిస్థితి. అతనితో భేటీ అగౌరవానికి సూచికగా భావిస్తున్న వైనం. మోడీ మాత్రం నిస్సిగ్గుగా కలవడం దేనికి సంకేతం. వీరిద్దరి ఆలోచనలు, వ్యూహాలు, అణచివేతలు, సిద్ధాంతాలు ఒకేలా ఉంటాయని ప్రచారం. అక్కడ ఒక జాతిని నిర్మూలిస్తుంటే, ఇక్కడ మత విద్వేషాలు రగిలించడం, ప్రాంతీయ విభేదాలతో అంటకాగడం దేశమంతా చూస్తున్నదే. గుజరాత్ మారణ హోమం దేశ రాజకీయ చరిత్రలో మాయని మచ్చ. అది నేటికీ మానని గాయం. ఆ సిద్ధాంతాన్నే బీజేపీ నమ్ముకుని పనిచేస్తోంది. ఆరెస్సెస్ అధినేత గోల్వాల్కర్ రాసిన పుస్తకంలో కూడా అదే గోచరిస్తుంది. "జాతి మరియు దాని శుద్ధతను కాపాడు కునేందుకు జర్మనీ యూదులను తొలగించింది. దాన్నిచూసి మనజాతి అత్యున్నతస్థాయిలో గర్వపడు తోంది. మూలాల్లోనే భిన్నతలు, అలా ఉన్న జాతులు సంస్కృతులు ఏకీకృతం కావడమనేది అసాధ్యం. ఇది జర్మనీ నిరూపించింది. హిందూస్థాన్‌లో కూడా మనం దీన్నుంచి నేర్చుకోవాలి" అని అందులో పేర్కొన్నారు. జర్మనీ ఊచకోతను సమర్థించడం కోసం, ఇక్కడ మైనార్టీలనూ అదేవిధంగా ఉద్దేశించడం గమనించాలి. జర్మనీలో హిట్లర్ యూదులను బంకర్‌లో పెట్టి చంపేశాడు. దాన్ని ఆదర్శంగా తీసుకోవాలని గోల్వాల్కర్ చెప్పాడు. అదే యూదులకు నాయకునిగా ఉన్న నెతన్యాహుకు మద్దతుగా ఉంటానని చెప్పడం, ఇదే బీజేపీ రాజకీయం!

ప్రతీ దేశానికి పరస్పర సహకారం, భద్రత అవసరమే. కానీ, ఆ చర్యలు మానవ హక్కుల ప్రమాణాలు దాటిపోతే ఏంటన్నది ప్రశ్న. పౌరుల ప్రాణనష్టం పెరిగితే అప్పుడు ప్రజాస్వామ్యం తన నైతిక అధికారాన్ని కోల్పోతుంది. మోడీ పాలనలో జరుగుతున్నది అదే! భారతదేశం చారిత్రాత్మకంగా పాలస్తీనా ప్రజల హక్కులకు మద్దతుగా నిలిచింది.అదే సమయంలో ఇజ్రాయిల్‌తో వ్యూహాత్మక సంబంధాలు పెంచుకుంది. ఈ సమతుల్యతే మన విదేశాంగ విధానం.కానీ, ఒక పక్షానికి దగ్గరవడం కోసం, మరోపక్షం బాధను ప్రస్తావించకపోవడం అసమతుల్యతను పెంచు తుంది. భారత్ ప్రజాస్వామ్య విలువకు ప్రతీకగా నిలవాలి. కానీ, ఈ మైత్రిబంధం మన ప్రజాస్వామ్యాన్ని మింగేయ కూడదు. మోడీ ఇజ్రాయిల్ పర్యటన ముగిసింది. కానీ, అది లేవనెత్తిన ప్రశ్నలు ఇప్పుడే మొదలయ్యాయి.

# అతిసార కట్టడికి పారిశుధ్య సమరం

**నవతరం -శ్రీకాకుళం**



నగరంలో డయేరియా పరిస్థితుల నేపథ్యంలో ప్రజారోగ్య పరిరక్షణే ధ్యేయంగా పారిశుధ్య పనులను జిల్లా యంత్రాంగం ముమ్మరం చేసింది. జాయింట్ కలెక్టర్, నగరపాలక సంస్థ ఇన్చార్జి కమిషనర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ మంగళవారం నగరంలోని పలు ప్రాంతాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. సెవెన్ రోడ్ జంక్షన్ లోని అన్నా క్యాంటీన్ ను సందర్శించిన ఆయన, అక్కడ పారిశుధ్య నిర్వహణను స్వయంగా పరిశీలించారు. అనంతరం కాజీపేటతో పాటు నగరపాలక సంస్థలోని పలు వార్డుల్లో పర్యటించి, క్షేత్రస్థాయిలో జరుగుతున్న పనులపై సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. నగరంలోని కాలువల్లో మురుగు నీరు నిల్వ ఉండకుండా ఉండేందుకు భారీ యంత్రాలతో ప్రక్షాళన చేపట్టారు. మంగళవారం నాటి పారిశు ధ్య నివేదిక ప్రకారం..

పారిశుధ్య పనుల కోసం మంగళవారం ఒక్కరోజే మొత్తం 17 జేసీబీలు, 24 ట్రాక్టర్లను రంగంలోకి దించారు. 84 ట్రిప్పుల ద్వారా మొత్తం 147 టన్నుల పూడిక, 39.25 టన్నుల చెత్తను కలిపి మొత్తం 186.25 టన్నుల వ్యర్థాలను నగర వెలుపలికి తరలించారు. సుమారు 3.89 కిలోమీటర్ల మేర కాలువల్లో పూడికను తొలగించి నీటి ప్రవాహానికి అడ్డంకులు లేకుండా చేశారు. నగరంలోని 57,082 గృహాలకు గాను, 49,912 ఇళ్ల నుంచి (87.43%) చెత్తను సేకరించారు. దీని ద్వారా సుమారు 30,496 కిలోల వ్యర్థాలు సేకరించినట్లు అధికారులు తెలిపారు.

**నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు:**

తనిఖీల్లో భాగంగా పారిశుధ్యంపై రాజీ పడే ప్రసక్తే లేదని ఇన్చార్జి కమిషనర్ స్పష్టం చేశారు. రోడ్లపై పశువుల సంచారం లేకుండా చూసేందుకు మంగళవారం 7 పశువులను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. ప్రజలు కూడా పరిసరాలను పరిశు భ్రంగా ఉంచుకోవాలని, మున్సిపల్ సిబ్బందికి సహకరించాలని ఆయన కోరారు. పారిశుధ్య పనుల్లో ఎటువంటి అలసత్వం వహించినా సంబంధిత అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా హెచ్చరించారు.

# తీరప్రాంత అభివృద్ధికి సిఎస్ఆర్ నిధులు...

- విద్యుత్ దీపాల ఏర్పాటుకు ఆమోదం
- ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి



**నవతరం- పోలాకి**

నరసన్నపేట నియోజకవర్గంలో తీరప్రాంతాల్లో విద్యుత్ వెలుగులు నింపే దిశగా కీలక ముందడుగు పడిందని,గౌరవ పార్లమెంట్ సభ్యులు, కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు గారి ప్రతిపాదన మేరకు కూల్ ఇండియా లిమిటెడ్ సంస్థ సిఎస్ఆర్ (కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబి లిటీ) కార్యక్రమం కింద తీరప్రాంతాల్లో ఎలక్ట్రికల్ దీపాల ఏర్పాటు చేపట్టనున్నట్లు పోలాకి మండలం కత్తిరివానిపేట క్యాంప్ కార్యాలయంలో నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి గారు ఓ ప్రకటనలో విడుదల చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే గారు మాట్లాడుతూ తీరప్రాంత గ్రామాలు సాయంత్రం తర్వాత చీకటిలో మగ్గిపోతున్న పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని ప్రజలకు భద్రత, సౌకర్యం కల్పించాలనే ఉద్దేశంతో ఈ ప్రతిపాదనను కేంద్ర మంత్రివర్యులు ముందుకు తీసుకువచ్చారని పేర్కొన్నారు. ముఖ్యంగా మత్స్యకారులు, తీరప్రాంత ప్రజలు రాత్రివేళల్లో రాకపోకలు సాగించేందుకు సరైన వెలుతురు అవసరమని, మహిళలు, వృద్ధులు, పిల్లల భద్రత దృష్ట్యా వీధి దీపాలు అత్యంత అవసరమని అన్నారు.ఈ ప్రతిపాదనకు సంబంధించి అవసరమైన పరిపాలనా ప్రక్రియలు పూర్తి చేసి శాంక్షన్ సాధించడంలో కేంద్ర మంత్రి కీలక పాత్ర పోషించారని తెలిపారు. తీరప్రాంత అభివృద్ధికి ఎల్లప్పుడూ కృషి చేస్తున్న కేంద్ర మంత్రివర్యులకు తీరప్రాంత ప్రజల తరఫున హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి గారు వెల్లడించారు.సిఎస్ఆర్ నిధులతో ఏర్పాటు కానున్న విద్యుత్ దీపాల ద్వారా రాత్రివేళల్లో ప్రమాదాలు తగ్గడమే కాకుండా సామాజిక భద్రత మెరుగుపడుతుందని, తీరప్రాంతాల్లో అభివృద్ధికి ఇది ఒక ముఖ్యమైన అడుగుగా నిలుస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు.

# తమిళనాడులో..... శయన రూపంలో శ్రీ మహావిష్ణువు ఆలయం




తమిళనాడులోని తిరువల్లూరులో ఉన్న ప్రసిద్ధ వీర రాఘవస్వామి ఆలయం విష్ణువు ఆదిశేషు పై యోగ నిద్రలో ఉన్నట్లుగా ఉండే అద్భుతమైన ద్రావిడ శైలి ఆలయం. ఏడవ దశాబ్దానికి చెందిన ఈ ఆలయం పల్లవ చోళ తాంజాపూర్ నాయకుల కాలంలో నిర్మించబడింది. ఎనిమిదవ శతాబ్దానికి చెందిన ఈ ఆలయం పల్లవుల కాలంలో ప్రారంభమై తాంజావూర్ నాయకుల కాలంలో మరింతగా అభివృద్ధి చెందింది మూలవిరాట్ ఆదిశేషులుపై పడుకుని భక్తులకు ఆశీస్సులు అందిస్తుంటాడు. చోళ కాలము నాటి మూడు ముఖ్యమైన శాసనాలు ఈ ఆలయంలో ఉన్నాయి. ఇవి ఆలయ నిర్మాణ సహకారాన్ని తెలియజేస్తున్నాయి. ఇక్కడ ఉన్న పవిత్రమైన కోనేరులో స్నానం చేయడం వల్ల పాపాలు నశిస్తాయని నమ్మకం.

ద్రావిడుల కాలం నాటి నిర్మాణశైలితో ఆకట్టుకునే రాజగోపురంతో కనిపిస్తుంది తిరువెల్లియాంగుడి కోటవిల్లి రామర్ ఆలయం. నూట ఎనిమిది వైష్ణవాలయాల్లో ఒకటిగా ప్రసిద్ధిగాంచిన ఈ క్షేత్రం తమిళనాడులోని కుంభకోణానికి దాదాపు ఇరవై కిలోమీటర్ల దూరంలో తిరువెల్లియాంగుడి అనే ప్రాంతంలో ఉంటుంది. స్వామి స్వయంభువుగా కొలువుదీరిన ఈ ఆలయాన్ని చోళరాజులు నిర్మించారని అంటారు. మహావిష్ణువు దేవేరి - లక్ష్మీదేవి మరకతవల్లి తాయార్ పూజలు అందుకునే ఈ మహిమాన్విత క్షేత్రంలో స్వామి రంగనాథస్వామిలా... శేషతల్పంపైన శయన రూపంలో ప్రకటితమవ్వడం వెనుక భాగవత, వామన పురాణాల ఆధారంగా కొన్ని కథలు ప్రాచుర్యంలో ఉన్నాయి.

## స్థలపురాణం

అసురుల రాజైన బలిచక్రవర్తి మహావిష్ణువుకు అపర భక్తుడు. గొప్ప దాతగా, మంచి పాలకుడిగా పేరు గాంచినా కూడా దేవతలను ఓడించి ఇంద్రలోకాన్ని ఆక్రమించాడు. దాంతో దేవతలంతా విష్ణుమూర్తికి విన్నవించుకున్నారట. అప్పుడు స్వామి వామనుడిగా అవతరించి, బలిచక్రవర్తి ఆస్థానానికి వెళ్లి మూడు అడుగుల భూమిని దానంగా ఇవ్వమని కోరాడట. అందుకు బలిచక్రవర్తి అంగీకరించినా,రాక్షసుల గురువైన శు క్రాచార్యుడు వామనుడి రూపంలో ఉన్నది విష్ణుమూర్తేనని గ్రహించి, బలిదానం ఇవ్వకుండా అడ్డుపడేందుకు యత్నించే క్రమంలో క్రిమిగా మారిపోయి, రాజు చేతిలోని కమండలంలోకి దూరాడట. అది గ్రహించిన స్వామి గరికపోచను కమండలంలోకి దూర్చడంతో శుక్రాచార్యుడి కన్ను దెబ్బతిని చూపు పోయిందట.శుక్రాచార్యుడు తన తప్పును గ్రహించి, తిరిగి కంటిచూపును పొందేందుకు ఈ ప్రాంతానికి వచ్చి విష్ణుమూర్తి అనుగ్రహం కోసం తపస్సు చేశాడట. దానికి మెచ్చిన స్వామి శంఖుచక్రాలు లేకుండానే వచ్చి ఆ అసుర గురువుకు మళ్లీ కంటిచూపును ప్రసాదించాడట. ఆ తర్వాత శుక్రాచార్యుడి కోరిక మేరకు ఇక్కడే కొలువుదీరాడని ప్రతీతి.

అందుకే విష్ణుమూర్తి ఇక్కడ వైకుంఠంలో మాదిరి శేషతల్పంపైన శయనించిన రూపంలో కనిపిస్తాడట.



అదేవిధంగా ఓ సందర్భంలో దేవతల శిల్పి అయిన విశ్వకర్మకూ- అసురుల శిల్పి అయిన మాయాసురుడికీ మధ్య ఎవరు గొప్ప అనే వాదన మొదలైందట. అప్పుడు బ్రహ్మ కల్పించుకుని మాయాసురుడితో... భూలోకానికి వెళ్లి వైకుంఠాన్ని పోలిన ఆలయాన్ని నిర్మించమని ఆదేశించాడట. అలా మాయాసురుడు ఈ ప్రాంతంలో ఆలయాన్ని నిర్మించడంతో, దానికి ప్రసన్నుడైన విష్ణుమూర్తి ఇక్కడకు వచ్చి, ఆ అసురుడి కోరిక మేరకు రాముడిగా దర్శనం ఇచ్చి స్వయంభువుగా స్థిరపడ్డాడనే కథా ప్రాచుర్యంలో ఉంది.

ఆకట్టుకునే రూపంతో...

తన భక్తుల్ని అనుగ్రహించేందుకు విష్ణుమూర్తి ఉన్నపళంగా వచ్చేస్తాడనడానికి గర్భాలయంలో కనిపించే స్వామి రూపమే' నిదర్శనం. భుజంగశయనుడిగా, రామర్గా పూజలు అందుకునే మూలవిరాట్టుకు శంఖుచక్రాలు ఉండవు. బదులుగా శ్రీమన్నారాయణుడి వాహనమైన గరుడపక్షి చేతిలో కనిపిస్తాయి. స్వామి శయన రూపంలో ఉన్నా అదనంగా ధనుస్సు చేతపట్టుకున్న రాముడి రూపాన్ని కూడా దర్శించుకోవచ్చు. అలాగే, స్వామి దేవేరికి విడిగా ఉన్న మందిరంతోపాటు.. ఆండాళ్, లక్ష్మీనరసింహస్వామి... తదితర దేవతామూర్తులనూ దర్శించుకోవచ్చు. శుక్రగ్రహం దోషం ఉన్నవాళ్లూ, కంటిచూపు సమస్యలతో బాధపడేవారూ ఎక్కువగా పూజించే ఈ అనంతశయన విష్ణుమూర్తికి ఏడాదికోసారి అంగరంగ వైభవంగా బ్రహ్మోత్సవాలను నిర్వహిస్తారు. అలాగే, రామనవమితోపాటు శు క్రజయంతి వేడుకల్లో పాల్గొనేందుకు భక్తులు ఎక్కడెక్కడినుంచో ఈ ఆలయానికి వస్తారు.



" కావ్యసుధ "
'వాఙ్మయ భూషణ'
" సాహితీ శిరోమణి "
" కవన సాగర "
'ఆధ్యాత్మిక సాహిత్య సామ్రాట్'
" ఆధ్యాత్మిక సాహితీ వ్యాస భూషణ్ "
9247313488 :
హయత్ నగర్ :
హైదరాబాదు

# పూజలు చేయ...!



జలాభిషేకం చేద్దామంటే
చేపలు ఎంగిలి చేశాయి.
పాలాభిషేకం చేద్దామంటే
దూడలు ఎంగిలి చేశాయి.
పుష్పాభిషేకం చేద్దామంటే
తుమ్మెద ఎంగిలి చేసింది
కనకాభిషేకం చేద్దామంటే
కల్తీలు పెరిగి పోయాయి
మాటాభిషేకం చేద్దామంటే
మాటలు మంచిగ లేవాయే
పాటాభిషేకం చేద్దామంటే
పాటలో పవిత్రత లేదాయే
మౌనమె నా పూజ తీరాయే
ధ్యానమే నాకు చేతనాయే
త్యజించక స్వీకరించుటే
స్వామి నీకు తప్పదాయే.

రచన: తేరాల రాజేంద్ర ప్రసాద్ గుప్తా
చరవాణి 9297109223



# ఆమె ఒక పుస్తకం..! ఆమె ఒక పున్నమి వెన్నెల..!



ఆమె అగ్నికి ప్రతిరూపం
ఆమె ఒక అనురాగ దీపం
ఆమె ఒక అమృతభాండం
ఆమె ఒక అవకాశం ఒక ఆకాశం..!

కన్నీటి బిందువుల్లో
కాంతిని దాచుకున్నది ఆమె...
కరిగిన గుండెలో
గర్జనను వినిపిస్తున్నది ఆమె...!

వివక్షల వడగాల్పుల్లో
వాడని వృక్షమై నిలిచిందామె...
మానభంగాల మేఘాల్లో
మెరుపై మెరుస్తుంది ఆమె...!

వీరవిజయ కాంతుల వేదికలపై
వెలుగువీణగా నినదించే
సుస్వరంఆమె..

త్యాగాల అనురాగాల జాబిల్లి ఆమె...
నీడనిచ్చే చల్లని తల్లి కల్పవల్లి ఆమె...
జీవజలధారలుగా గలగలపారే
గంగఆమె..

ఆమె అడుగుల సవ్వడికి
నేల పునీతమౌతుంది
ఆమె నవ్వులపువ్వులు రువ్వితే
ఉషోదయం ఉదయిస్తుంది..!

బండరాళ్లవంటి బాధల్ని
బంగారు మెట్లు చేసి
భవిష్యత్తు గగనంలో
విజయపతాకం ఎగురవేసేది ఆమె..!

ఆమె శక్తి స్వరూపిణి
సహన శిఖరాన్ని తాకే శిఖామణి...
ఆమె ప్రేమమూర్తి
ప్రపంచానికే ఒక
ప్రాణప్రదాత...!

అమ్మగా ఆకాశం...
అక్కగా ఆశ్రయం...
భార్యగా భరోసా...
సఖిగా సత్యసంధాత ఆమె..!

అవమానాల
అగ్నిగుండం దాటిన
మహోన్నత శక్తి...మహిళ..!

చరిత్రను రాసేది ఆమె చేతి
కలం
భవితను మలిచేది ఆమె గుండె
ధైర్యం..

తనను అణగదొక్కిన అడుగులనే
ఒక్కొక్కటి పేర్చి పేర్చి మెట్లుగా
మార్చి
ఆకాశపుటంచులపై
జెండా నాటేది
ఆమె..!

వేయి వేదనల
రాళ్లరాగాలపైన
విజయవీణను వాయించిన
వీరనారి ఆమె..!
కన్నీటి సముద్రాన్నే
కిరీటంగా ధరించిన కీర్తిశిఖరం
ఆమె..!

అణచివేతల అగ్నిపర్వతాన్ని
అవకాశాల ఆకాశదీపంగా
మలిచిన మహా ప్రతిభాశాలి ఆమె..!


సృష్టికి శిరోమణిగా...
సమానత్వపు సూర్యోదయంగా
యుగయుగాల్ని యజ్ఞవేదికగా మార్చే
ఓ నవయుగనాయకీ నీకు వందనం..!

(అంతర్జాతీయ మహిళా దినోత్సవం
సందర్భంగా మహిళామూర్తులకు
శుభాకాంక్షలు)ం



కవి రత్న
సాహిత్య ధీర,
సహస్ర కవి భూషణ్,
**పోలయ్య కూకట్లపల్లి,**
అత్తాపూర్, హైదరాబాద్

# నూతన పట్టదారు పాస్ పుస్తకాల పంపిణీ



**నవతరం -పలాస**

"మీ భూమి – మీ హక్కు" కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ రాజముద్రతో ముద్రించిన పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ కార్యక్రమం పలాస మండలం, నీలిపద్ర గ్రామంలో మంగళవారం జరిగింది. ఈ కార్యక్రమంలో ఏపీటీపీసీ చైర్మన్ వజ్జ బాబూరావు, జిల్లా గ్రంథాలయసంస్థ చైర్మన్ పీరుకట్ల విఠల్, ఏఎంసీ చైర్మన్ మల్లా శ్రీనివాసరావు తదితరులు స్థానిక శాసనసభ్యురాలు గౌతు శిరీష ఆదేశాలతో ముఖ్య అతిథులుగా పాల్గొని రైతులకు పట్టాదారు పాస్ పుస్తకాలను అందజేశారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం రైతుల కళ్ళల్లో వెలుగులునింపేందుకు అధికారంలోకి వచ్చిన వెంటనే ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు చేసిందన్నారు. పట్టాదారు పాస్ పుస్తకాలపై అప్పటి ముఖ్యమంత్రి జగన్ ఫోటోను చూసిన రైతులు నిద్రలేని రాత్రులు గడిపారని , భూమి సరిహద్దు రాళ్లపై కూడా అప్పటి ముఖ్యమంత్రి ఫొటో ముద్రించుకోవడంతో రైతులు తమ భూమి ఏమైపోతుందోనని ఆవేదన చెందారని, మన భూమిపై పులివెందుల పంచాయతీ ఉండేదని, కూటమి ప్రభుత్వం రైతులకు మంచి చేసేందుకు రాజముద్ర తో కూడిన పట్టాదారు పాస్ పుస్తకాలు అందజేస్తున్నామన్నారు. లిటిగేషన్ భూముల క్రమబద్దీకరణ, భూ సమస్యలు పరిష్కారానికి ప్రభుత్వం చొరవ చూపిందని, కోట్ల రూపాయల ఆదాయాన్ని వదులుకుని రైతులకు మంచి చేయాలనే లక్ష్యంతో ముందుకు సాగడం కూటమి ప్రభుత్వ విధానాలకు నిదర్శనమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పలాస పీఏసీఎస్ చైర్మన్ వంకల కుర్మారావు, అగ్నికుల క్షత్రియ డైరెక్టర్ కుత్తుం లక్ష్మణ్, తెలుగుదేశం పార్టీ పలాస మండల ప్రధాన కార్యదర్శి దువ్వాడ సంతోష్ రామ్ నాయుడు, పలాస తహసీల్దార్ కళ్యాణచక్రవర్తి, డీటీ గిరి, రెవెన్యూ అధికారులు, సచివాలయ సిబ్బంది, కూటమి నాయకులు, కార్యకర్తలు, మహిళలు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# పవన్ కల్యాణ్.. ఇక అట్నుంచి అటే

మలి విడత సినిమాలకు సంబంధించి పవన్ కల్యాణ్ కాల్షీట్లు ఖరారయ్యాయి. ఉస్తాద్ భగత్ సింగ్ ప్రమోషన్ నుంచి పవన్ తిరిగి సినిమాల్లోకి రాబోతున్నారు.
ముందుగా ఉస్తాద్ భగత్ సింగ్ కు సంబంధించి 2 ప్రచార కార్యక్రమాల్లో పాల్గొంటారు పవన్ కల్యాణ్. గతంలో హరిహర వీరమల్లు, ఓజీ సినిమాలకు చేసినట్టు కాకుండా.. ఈసారి పవన్ తో కాస్త కొత్తగా, వినూత్నంగా ప్రచార కార్యక్రమాలు ప్లాన్ చేశాడు దర్శకుడు హరీశ్ శంకర్.
పవన్ కేటాయించిన 2 రోజుల కాల్షీట్లలో ఒక రోజు ప్రీ-రిలీజ్ ఫంక్షన్ కిందకు వెళ్లిపోతుంది. మిగిలిన ఒక రోజును పవన్ తో డిఫరెంట్ గా క్యాంపెయినింగ్ ప్లాన్ చేస్తున్నాడు హరీశ్. అయితే ఈ ఒక్క రోజు మీడియాతో ఇంటరాక్షన్ ఉంటుందా ఉండదా అనేది ప్రస్తుతానికి సస్పెన్స్. ఇప్పటికే ఈ సినిమా ప్రచారం కోసం రౌండ్ టేబుల్ ఇంటర్వ్యూ లాంటిది ఒకటి చేశాడు హరీశ్. విడివిడిగా ఒక్కొక్కర్ని పిలిచి ఇంటర్వ్యూలు ఇచ్చే కంటే, ఇలా ముగ్గురు నలుగుర్ని పిలిచి దానికి రౌండ్ టేబుల్ అని పేరు పెట్టి, పని కానిచ్చేయడం ఈమధ్య కొత్తగా మొదలైంది. హరీశ్ కూడా అదే పని చేశాడు.
అయితే పవన్ తో మాత్రం దొరికిన ఆ ఒక్క రోజు ఆయన కొత్తగా ప్రచార కార్యక్రమాలు చేయాలని అనుకుంటున్నాడట. అనీల్ రావిపూడి, తన హీరోలతో ఎలాగైతే డిఫరెంట్ గా ప్రచార వీడియోలు చేస్తుంటాడో, ఆ స్టయిల్ లో పవన్ తో చేయాలనేది హరీశ్ ప్లాన్.
ఇదే కనుక కార్యరూపం దాలిస్తే, ఫ్యాన్స్ కు పండగే. ఉస్తాద్ ప్రమోషన్ ముగిసిన వెంటనే కొన్ని రోజులు గ్యాప్ ఇచ్చి, కొత్త సినిమాకు కాల్షీట్లు కేటాయించారు పవన్.



# సూర్య మరో ప్రయోగం చేస్తున్నాడా..?

ఒకప్పుడు ప్రయోగాలకు పెట్టింది పేరు. అలా ప్రయోగాలు చేస్తూనే హిట్స్ కూడా కొట్టాడు. ఆ తర్వాత ప్రయోగాలు మాత్రమే మిగిలాయి, హిట్స్ దూరమయ్యాయి. ఇదీ ప్రస్తుతం సూర్య పరిస్థితి.



ఇలాంటి టైమ్‌లో వెంకీ అట్లూరి దర్శకత్వంలో సినిమా చేస్తున్నాడు సూర్య. ఇతడు హీరో కాబట్టి ఇది ప్రయోగాత్మక చిత్రమని చాలామంది అనుకున్నారు. వెంకీ అట్లూరి దర్శకుడు కాబట్టి ప్రయోగాలకు దూరంగా, కొత్త తరహా కథ అయి ఉంటుందని మరికొందరు భావించారు.
రెండోదే నిజమైంది. వెంకీ అట్లూరి దర్శకత్వంలో ఓ సరికొత్త కథలో కనిపిస్తున్నాడు సూర్య. పేరు విశ్వనాథ్ అండ్ సన్స్. టైటిల్ ఇప్పటికే లీకైంది, ఆ లీకైన టైటిల్ తో పోస్టర్ ఈరోజు వచ్చింది.
ఎలాంటి మేకోవర్ లేకుండా సింపుల్ గా, క్లాస్‌గా ఉన్నాడు సూర్య. తండ్రిగా కూడా కనిపించాడు.
తన ప్రతి సినిమాకు ఒక దానితో ఒకటి సంబంధం లేని కథలు ఎంపిక చేసుకుంటున్నాడు వెంకీ అట్లూరి. సర్, లక్కీ భాస్కర్ సినిమాలకు ఎలాంటి పోలికలు ఉండవు. ఇప్పుడీ రెండు సినిమాలకు భిన్నంగా విశ్వనాథ్ అండ్ సన్స్ సినిమా రాబోతోందనే విషయం ఫస్ట్ లుక్ చూస్తే అర్థమౌతోంది.
సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ బ్యానర్ పై తెరకెక్కుతున్న ఈ చిత్రానికి జీవీ ప్రకాశ్ కుమార్ సంగీతం అందిస్తున్నాడు. త్వరలోనే టీజర్ రిలీజ్ చేసి, జులైలో సినిమాను థియేటర్లలోకి తీసుకురాబోతున్నారు. సూర్య నటిస్తున్న తొలి తెలుగు స్ట్రయిట్ సినిమా ఇది.

# అంబేడ్కర్ యూనివర్సిటీ అక్రమ నియామకాలు రద్దు చేయాలి..

## (తూర్పు కాపు ఉద్యోగ సంఘం డిమాండ్)



**నవతరం- శ్రీకాకుళం**

రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ పేరుతో స్థాపించిన శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్ల అంబేద్కర్ విశ్వవిద్యాలయంలో ఇటీవల జరిపిన అక్రమ నియామకాలు తక్షణమే రద్దు చేయాలని.. శ్రీకాకుళం జిల్లా తూర్పు కాపు ఉద్యోగ సంఘాల ప్రతినిధులు డిమాండ్ చేశారు.. మంగళవారం శ్రీకాకుళం నగరంలో ఇందిరా విజ్ఞాన్ భవన్లో నిర్వహించిన జిల్లా తూర్పు కాపు ఉద్యోగ సంఘం సమావేశంలో ఉద్యోగ సంఘాల నేతలు అంకడాల తవిటన్న.. కిల్లారు నారాయణరావు.. డాక్టర్ ఎం. రామజోగినాయుడు.. వాళ్తేటి సత్యనారాయణ లు మాట్లాడుతూ.. విశ్వవిద్యాలయ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ఉపకులపతి డాక్టర్ కె యస్ రజని నియంతలా వ్యవహరిస్తున్నారని ధ్వజమెత్తారు.. ప్రజల ద్వారా ఎన్నికైన ప్రజా ప్రతినిధులకు.. ఉన్నత అధికారులకు.. మంత్రులకు కనీసం గౌరవ మర్యాదలు లేకుండా ప్రవర్తిస్తూ.. జిల్లా పరువు ప్రతిష్టలు మంట గొలుపుతున్నారని.. ప్రభుత్వం తక్షణమే స్పందించి తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.. విశ్వ విద్యాలయం లో పనిచేస్తున్న తూర్పు కాపు ఉద్యోగులపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడితే సహించేది లేదని వారు హెచ్చరించారు.. అవినీతికి.. అవకతవకలకు.. అక్రమాలకు నిలయమైన అంబేద్కర్ విశ్వవిద్యాలయం ఉపకులపతి ను వెంటనే డిస్మిస్ చేసి.. ఆమె హయాంలో జరిగిన అక్రమాలపై విచారణ జరిపి కటిన చర్యలు తీసుకోవాలని ముక్తకంఠంతో కోరారు.. కోట్లాది రూపాయలు ప్రజాధనాన్ని బహిరంగంగా దోచుకుంటున్న అక్రమార్కులపై ప్రభుత్వం శాసనసభ కమిటీ ను నియమించి సమగ్ర విచారణ జరిపి బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.. అంతకన్నా ముందు ఇటీవల పదోన్నతులు పొందిన ముగ్గురు ఉద్యోగులను సత్కరించారు.. పదోన్నతులు పొందిన వారిలో గొంటి తిరుపతి రావు.. టెక్కలి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ .. గార నిర్మల ఉపఖజానా శాఖ అధికారి గా.. బోర రవీంద్ర ఉప ఖజానా శాఖ అధికారిగా పదోన్నతులు పొందారు.. వీరి సేవలు వెలకట్టలేనివని.. స్లాగిస్థూ.. సత్కరించారు.. విధి నిర్వహణలో నిజాయతీగా పనిచేసి అందరి అభిమానాన్ని పొందాలని సూచించారు.. ఈ కార్యక్రమంలో శ్రీకాకుళం జిల్లా తూర్పు కాపు ఉద్యోగ సంఘాల ప్రతినిధులు.. శాసపు జోగినాయుడు ..మక్కా శ్రీనివాస్.. దాసరి రామచంద్ర రావు.. కరణము నరిసింగరావు.. లావేటి సుందరరావు.. దన్నాన మోహనరావు.. కురిట్ దుర్గారావు.. నేతల అప్పారావు.. తదితరులు పాల్గొన్నారు..

# చౌదరి సత్యనారాయణ కాలనీ యువత ఉదారత

## - కాన్సర్ బాధితునికి రూ. 10 వేలు ఆర్థికసాయం

**నవతరం- శ్రీకాకుళం**



నియోజకవర్గ మండలం అంపోలు గ్రామానికి చెందిన కాన్సర్ బాధితులు ఉట్ల. హేమంత్ కుమార్ లివర్ మార్పిడికి సహాయార్ధం చౌదరి సత్యనారాయణ కాలనీ యువత ఉదారత చాటుకున్నారు. స్నేహితులు తలో చెయ్యి వేసి సమకూర్చిన రూ. 10 వేల 116 రూపాయల ఆర్థికసాయాన్ని హేమంత్ కుటుంబ సబ్యులకు అందించి మాట్లాడుతూ రెడ్ క్రాస్ ప్రతినిధి ఉమా శంకర్ స్టేటస్ మేరకు మా చిరుసాయాన్నందించామని, హేమంత్ కుటుంబం ఆర్థికంగా లేనికారణంగా దాతలు సహాయం కోసం ఎదురుచూస్తున్నారన్నారు. మనసున్న దాతలు సహకరించాలని పూర్తి వివరాలకు ఆయన చరవాణిని సంప్రదించాలని, లేదా ఫోన్ పే (9804020039) ద్వారా సహాయమందించాలన్నారు.

ఈ కార్యక్రమంలో నక్క.గోవింద్, బగాది. శ్రీనివాసరావు, మహంతి.సూర్య, జనార్దన్, పడాల.పవన్, గుంతకు.కిరణ్ , కుంచాడా మౌళి, హేమంత్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

యూ. హేమంత కుమార్, 31070101846 ఐఎఫ్ఎస్సి కోడ్ SBIN0000919.

# ఉపాధి హామీ పథకం యధాతథంగా అమలు చేయాలి

## ఏఐ కేఎంఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు వంకల మాధవరావు డిమాండ్

**నవతరం- శ్రీకాకుళం**



జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పాత పద్ధతిలో యధాతథంగా అమలు చేయాలని రాష్ట్ర ఉపాధ్యక్షులు వంకల మాధవరావు జిల్లా కార్యవర్గ సభ్యులు సవర సొరయ్య లక్ష్మణరావు సవర బంగ్లా కుమార్ భాస్కరరావు అరుణోదయ సంస్కృతి సమైక్య జిల్లా కార్యదర్శి సోమేశ్వరరావు డిమాండ్ చేశారు మంగళవారం మెలియాపుట్టిలో జరిగిన సమావేశం లో మాధవరావు మాట్లాడుతూ మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి చట్టాన్ని వికసిత్ భారత్ గ్యారంటీ ఆఫ్ రోజ్ గార్ మరియు అజీవిక మిషన్ గ్రామీణ్ (వి.బి.జి - రాంజీ) గా పేరు మార్పు చేయడంతో ఈ చట్టాన్ని మరింతగా నీరుగార్చే కొన్ని సవరణతో కేంద్ర ప్రభుత్వం డిసెంబర్ 16న పార్లమెంట్ ఉభయ సభలలోను బిల్లును ప్రవేశ పెట్టింది తగిన చర్చకు అవకాశం ఇవ్వకుండానే విపక్షాల అభ్యంతరాలను పరిగణలోకి తీసుకోకుండానే ఆగమేఘాల మీద డిసెంబర్ 18వ తేది నాటికి చట్ట రూపంలో తీసుకొచ్చారు.

గతంలో ఉన్న ఉపాధి హామీ చట్టం ఉపాధి అవకాశాలు కల్పించడంలో లోటుపాట్లతో నిండా అవినీతిలో కూరుకుపోయినప్పటికీ దేశంలోనే గ్రామీణ, ఆదివాస ప్రాంతాల ప్రజానీకానికి ఏదో మేరకు ఉపశమనంగా పనిచేస్తున్న ఈ పథకాన్ని సైతం కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం మరింతగా నీరుకారుస్తుంది చెల్లించాల్సిన వేతనాలను ఇప్పటివరకు 90% కేంద్రం 10% ఆయా రాష్ట్రాలు భరిస్తుండగా ప్రస్తుత చట్టంలో 60% ఖర్చు మాత్రమే కేంద్ర భరిస్తామంటూ రాష్ట్రాలపై మరింత భారాన్ని ఈ నూతన సవరణ చట్టం మోపుతున్నది. అంతేకాక రాష్ట్రాలు తాము నిర్ణయించుకున్న పనులను ఉపాధి హామీ పథకం ద్వారా చేయడానికి ఉండే అవకాశాన్ని కూడా కేంద్రం ఈ చట్టం ద్వారా గుంజివేసుకుంటుంది.

ఆ విధంగా రాష్ట్రాలపై పెత్తనం చెలాయించదల్చుకున్న వ్యవసాయ సీజన్లో కూలీలకు చేతినిండా పనులు లభ్యం కానీ అంతే కాకుండా వ్యవసాయ సీజన్లో రెండు నెలల పాటు ఉపాధి హామీ పనులు నిలిపివేయాలని ఈ నూతన ఉపాధి హామీ చట్టంలో ఉంది.

దేశవ్యాప్తంగా ఉపాధి కూలీలకు రావాల్సిన వేల కోట్ల బకాయిలో ఇంతవరకు చెల్లించలేదు ఉపాధి హామీ పథకాన్ని రద్దు చేయాలనే ప్రయత్నాన్ని తక్షణమే నిలిపివేయాల గత ఉపాధి హామీ చట్టాన్ని మెరుగుపరిచి అమలుపర చాలి ఉపాధి పొందడాన్ని హక్కుగా గుర్తించాలి.

ఉపాధి పని దినాలు 100 నుండి 200 పెంచాలి రోజు కూలీ 700 రూపాయలు ఇవ్వాలి.

. పెండింగ్ బకాయిలు వెంటనే చెల్లించాలి

# యువతను మోసం చేసిన కూటమి ప్రభుత్వం

- నిరుద్యోగ సమస్యలపై మౌనం ఎందుకు?
- నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలి
- ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మొజ్జాడ యుగంధర్...

**నవతరం- శ్రీకాకుళం**



రాష్ట్రవ్యాప్తంగా ఉన్న నిరుద్యోగ సమస్యలను పరిష్కరించాలని వారికి ఇచ్చిన హామీలను అమలుపరచాలని స్థానిక నరసన్నపేట మండల కేంద్రంలో పాత్రికేయుల సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మొజ్జడ యుంగంధర్ మాట్లాడుతూ రాష్ట్రంలో యువత ఎదుర్కొంటున్న నిరుద్యోగ సమస్యలు తక్షణ పరిష్కరించాలని కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో యువతకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రభుత్వం వారిని మోసం చేస్తుందని వారు తీవ్రంగా విమర్శించారు.

రాష్ట్రంలో లక్షలాది నిరుద్యోగ యువత భవిష్యత్తు చీకట్లోకి నెట్టబడుతున్నప్పటికీ, ప్రభుత్వం నిర్వహించిన ఆంధ్ర ప్రదేశ్ అసెంబ్లీ సమావేశాల్లో నిరుద్యోగ సమస్యలపై ఒక్క మాట కూడా ప్రస్తావించకపోవడం అత్యంత దురదృష్టకరమని ఆగ్రహం వ్యక్తం చేశారు. యువత ఆత్మవిశ్వాసం దెబ్బతింటున్నా, వారి భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారుతున్నా ప్రభుత్వం స్పందించకపోవడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో హామీ ఇచ్చిన నిరుద్యోగ భృతి, ఖాళీగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ, పారదర్శక నియామక విధానం వంటి అంశాలు పూర్తిగా విస్మరించబడినట్లు స్పష్టమవుతోందని వారు తెలిపారు.

ప్రభుత్వ విధానాలు యువతను ఆశాభంగానికి గురిచేస్తూ, ఉద్యోగార్థుల పట్ల నిర్లక్ష్య ధోరణిని ప్రదర్శిస్తున్నాయని విమర్శించారు. ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బొత్స సంతోష్, కొన్న శ్రీనివాస్ మాట్లాడుతూ

రాష్ట్రంలో ఖాళీగా ఉన్న అన్ని ప్రభుత్వ ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలని, తక్షణమే నోటిఫికేషన్లు విడుదల చేసి పారదర్శకంగా నియామక ప్రక్రియ చేపట్టాలని డిమాండ్ చేసారు నిరుద్యోగ యువత సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం స్పష్టమైన కార్యాచరణ ప్రణాళిక ప్రకటించకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

నిరుద్యోగ యువత జీవితాలతో రాజకీయ చదరంగం ఆడే ప్రయత్నం చేస్తే, అదే యువత మీ రాజకీయ అస్తిత్వానికి సమాధి కడుతుందని తీవ్రంగా హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నాయకులు = అరవింద్, చీ సాంబశివరాజు, వై. వేణు, భాస్కర్, వాసు, రాము తదితరులు పాల్గొన్నారు.

# పేద ప్రజల ఆరోగ్యానికి అధిక ప్రాధాన్యత

## ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్

**నవతరం -పొందూరు**



స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్లో రూ. 55 లక్షల నిధులతో చేపట్టనున్న ఆధునికీకరణ పనులకు ఎమ్మెల్యే కూన రవికుమార్ మంగళవారం పూజా కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే కూన రవికుమార్ మాట్లాడుతూ, పొందూరు ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించాలనే లక్ష్యంతో సీహెచ్‌సీని ఆధునికీకరించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని, ఆధునిక వైద్య పరికరాలు, మెరుగైన వసతులు, సిబ్బంది సౌకర్యాలు ఏర్పాటు చేయడం ద్వారా రోగులకు సమగ్ర వైద్య సేవలందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

గ్రామీణ ప్రాంతాల్లో ఆరోగ్య సదుపాయాలు బలోపేతం చేయడం ద్వారా ప్రజలు పెద్ద పట్టణాలకు వెళ్లాల్సిన అవసరం తగ్గుతుందని, స్థానికంగానే నాణ్యమైన వైద్యమందేలా చర్యలు కొనసాగుతాయని స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమంలో కూటమి ముఖ్య నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, వైద్యాధికారులు, పార్టీ కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

Printed by **SIRIGIRI VARADARAJU**, and published by **SIRIGIRI VARADARAJU**, on behalf of **SIRIGIRI VARADARAJU**, and printed at : Kranthi Publications, D.No.2-504/1, **Aditya Nagar** Colony, **Arasavilli,** Srikakulam,Srikakulam dist. ANDHRA PRADESH STATE - 532 401, **Published at :** Kranthi Publications, D.No.2-504/1, Srikakulam dist. ANDHRA PRADESH STATE - 532 401, Editor : **SIRIGIRI VARADARAJU**, Email: navataramraju@gmail.com, **Cell : 9959007255, 8340844777**